నిజామాబాద్ సోమవారం 2 సెప్టెంబర్ 2024
MONDAY 2 SEPTEMBER 2024


పెన్‌గంగా డొల్లార వద్ద వరద నీటితో పెన్‌గంగా నది


తలమడుగు : నేలకొరిగిన పత్తి, కంది పంట



కుభీర్ : కుభీర్ ప్రభుత్వ దవాఖాన చుట్టు చేరిన వరద నీరు


అక్కొండపేటలో మత్తడి దూకుతున్న భీమన్న చెరువు

# జోరు వాన

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- అలుగు దూకుతున్న చెరువులు, కుంటలు
- ప్రాజెక్టుల గేట్ల ఎత్తివేత
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక
- కంట్రోల్ రూముల ఏర్పాటు


నిర్మల్ మండలం స్వర్ణ వాగు వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న స్వర్ణ వాగు


మత్తడికి దుంకుతున్న తాంసి వాగు

బోథ్, సెప్టెంబర్ 1 : మండలంలో భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి మొదలైన వర్షం ఆదివారం కొనసాగింది. కురిసిన వర్షం 87.6 మిల్లీ మీటర్లుగా నమోదైంది. పెద్ద వాగు, సొనాలవాగు, ధన్నూర్(బీ) వాగు, నక్కలవాడ వాగులు పొంగిపొర్లాయి. వాగులో నీటి ఉధృతి మూలంగా నక్కలవాడ ప్రాంతంలోని నాలుగు గ్రామాలతోపాటు కోట(కే), పెద్దగూడ గ్రామాల ప్రజలు వాగులు దాటి బటయకు రాలేకపోయారు. బోథ్, చింతల్‌బోరి ప్రాజెక్టుల వద్ద అలుగుల నుంచి నీరు ఎగిసిపడింది.

## పొచ్చెర జలపాతం పరవళ్లు

పొచ్చెర జలపాతం పరవళ్లు తొక్కింది. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో పెద్ద వాగులో నీరు ఉధృతంగా ప్రవహించింది. జలపాతం వద్ద జలదార ఎత్తిపోసింది. జలపాతాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల వారు తరలి వచ్చారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మ న్ బొడ్డు గంగారెడ్డి, ఎంపీడీవో జీవన్ రెడ్డి సూచించారు. ఆదివారం నక్కలవాడ వాగు వంతెనను వారు పరిశీలించారు.

ముథోల్, సెప్టెంబర్, 1 : మండల వ్యాప్తంగా భారీ వర్షాలకు కాలనీలు నీట మునగడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముథోల్‌లోని సాయి మాధవ్ నగర్ కాలనీలో సరైన మురికి కాలువలు, రోడ్డు వ్యవస్థ లేకపోవడంతో కాలనీ నీటమునిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైతం వర్షపు నీరు లోపలికి చేరింది. ముథోల్‌లోని సాయమాధవ్ నగర్ రోడ్లన్నీ ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆదివారం జలమయమయ్యాయి. దీంతో కాలనీ వాసులతో పాటు ఈ రోడ్డు గుండా రాకపోకలు కొనసాగించే వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ నారాయణ పటేల్ కాలనీకి వెళ్లి పరిశీలించారు. ప్రధాన రోడ్డుపై అక్కడక్కడ పెద్ద గుంతలు ఏర్పడడంతో వెంటనే గుంతలు పూడ్చడానికి మొరం తెప్పించి వేయించారు.

నేరడిగొండ, సెప్టెంబర్ 1: మండలంలో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లోని పంటలు ముంపుకు గురయ్యాయి. వరదనీటితో పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని కుంటాల జలపాతానికి భారీగా వరదతాకిడి ఉంది. దీంతో జలపాతం వద్ద వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తుంది.

లక్ష్మణచాంద, సెప్టెంబర్ 1: మండలంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా తహసిల్దార్ జానకీ, ఎస్సై సుమలత తన సిబ్బందితో కలిసి పర్యవేక్షణ చేశారు. అత్యవసరమైతే తప్పా బయటకు వెల్లరాదని మండల ప్రజలకు వారు పిలుపునిచ్చారు.

భీంపూర్, సెప్టెంబర్ 1 : మండలంలోని వాగులు, వంకలు, పెన్‌గంగ ఉధ్రుతిగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు నిండాయి . సరిహద్దులో గుబిడి, గోముత్రి, అంతర్గాం, అర్లి (టి), వడూర్, గొల్లగడ్, తాంసి(కె) రేవుల గుండా పెన్‌గంగ వరద నీరుతో ప్రవహిస్తున్నది. ఇక కరంజి (టి), గోముత్రి ,అం తర్గాం సహా ఇతర శివార్లలో కూడా చేలు నీట మునిగాయి . చివరి దశ లోని పత్తి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. కంది, జొన్న, తృణ ధాన్య పంటలకు కూడా నష్టం వాటిల్లటంతో రైతులు ఆందోళన వ్యక్తంజేస్తున్నారు. కరంజిలో పెద్దవాగు, భీమన్న ఒర్రె, టేకిడిరాంపూర్ వాగు, అందర్‌బంద్ వాగు, నిపాని, అంతర్గాం వద్ద వాగులు బ్రిడ్జిలు, కల్వర్టుల మీదుగా ప్రవహించటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇక మారు మూల గుబిడి, కొజ్జన్‌గూడ వాసులు బయటి గ్రామాలక రాలేని పరిస్థితి ఉన్నది. కరంజి శివా రులో చేలలోని ట్రాన్స్‌ఫార్మర్ ఈదురు గాలులకు పడిపోయింది. నిపాని వద్ద కల్వర్టు కోతకు గురయింది, అక్కడ సబ్‌స్టేషన్ వరకు వరదనీరు చేరింది.

### వరదలపై అధికారుల అప్రమత్తం

మండలంలోని పెన్‌గంగ పరీవాహక గ్రామాలను ఆదివారం సాయంత్రం తహసీల్దార్ నారాయణ రావు, డీటీ హరిదాస్, ఎస్ఐ కలీంలు సిబ్బందితో సందర్శించారు. సూచనలు చేశా రు. మహారాష్ట్ర నాందేడ్, యవత్‌మాల్ జిల్లా అధికారులు తమ ఇసాపూర్ తదితర ప్రాజెక్టులలో 76 శాతం నీరు చేరినందున నీరు తగ్గించటం కోసం గేట్లు తీసే అవకాశం ఉన్నందున దిగువ తెలంగాణ గ్రామాల వారిని అప్రమత్తం చేయాలని ఇక్కడి అధికారులకు సమాచారం ఇచ్చారు.

### నిలిచిపోయిన రాకపోకలు

తానూర్, సెప్టెంబర్, 1 : మండలంలోని ఝురి(బి) గ్రామ సమీపంలో గ్రామానికి రాకపోకలు నిలిచి పోయాయి. విష యం తెలుసుకున్న తహసీల్దార్ లింగమూర్తి, మండల అభివృద్ధిఅధికారి అబ్దుల్ సమద్, సీఐ మల్లేష్, ఎస్ఐ లోకం సందీప్ పొంగి ప్రవహిస్తున్న వాగును పరిశీలించారు. వాగును దాటి ఎవరు రాకుడదని గ్రామస్థులకు తెలియజేశారు.

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 1: మండలంలోని చింతల్‌స్వాంగి గ్రామానికి వెళ్లె రహాదారిలో ఉన్న వాగు ఉధ్రుతంగా ప్రవాహించడంతో అటువైపుగా వెళ్లే గ్రామాలకు రాకపోకలు స్తంభించడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. అంతేకాకుండ దేగామ చెరువులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది.

### కనువిందుగా కనకాయ జలపాతం

మండలంలోని కడెం నదిపై గల కనకాయ జలపాతం గత రెం డు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కనువిందు చేస్తుంది. దట్టమైన అటవీప్రాంతంలో పక్షుల కిలకిల రాగాలనడుమ ఎతైన ప్రదేశాల నుంచి పాలపొగ్గుల వలే జాలువారుతున్న నీటిని చూసేందుకు పర్యాటకుల తాకిడితో నిత్యం కనువిందు చేస్తోంది.

### ఒర్రె దాటేందుకు సాహసం చేయద్దు

నార్నూర్, సెప్టెంబర్1: వర్షాలు కురిసే సమయంలో ఒర్రె దాటేందుకు సాహసం చేయ్యొవద్దని ఎంపీవో స్వప్నశీల ప్రజలకు సూచించారు.

ఖానాపూర్, సెప్టెంబర్ 1: జేకే నగర్, సుభాష్‌నగర్, మదీనకాలనీ, రాజీవ్‌నగర్, విద్యానగర్‌లలో వరద నీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజలు ఇంబ్బందులు ఎదుర్కొన్నారు. గాంధీనగర్, అంబేద్కర్‌నగర్ కాలనీ శివారులోని రెంకొనివాగు తాత్కలిక రోడ్డుపై నుంచి వరద నీరు ఉధ్ధృతంగా ప్రవాహించడంతో పోలీసులు వాహణ రాకపోకలను కుమ్రం భీం చౌరస్తా మీదుగా మంచిర్యాల వైపు మళ్లించారు.

### భైంసా - పార్డి(బి) రాకపోకలు బంద్

భైంసాటౌన్, సెప్టెంబరు 1 : మండలంలోని గుండేగాం వద్ద నిర్మించిన రంగారాం పల్సికర్ బ్యాక్ వాటర్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో భైంసా, మహాగాం, పార్డి(బి) తదితర గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి పోయాయి.

దస్తురాబాద్, సెప్టెంబర్ 1: అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా దస్తురాబాద్ మండలంలో ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురుస్తుంది. దీంతో వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. అక్కొండపేట గ్రామంలో భీమన్న చెరువు పూర్తిగా నిండి మత్తడి దూకింది. భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇండ్లకే పరిమితమయ్యారు.

### అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదివారం దేవుని గూడెం, భూత్కూర్, రాంపూర్, మున్యాల్, గొడిసెర్యాల గ్రామాల్లో ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ అవగాహణ కల్పించారు. కడెం గేట్లు విడుదల చేశారని, పశువుల కాపార్లు, మత్స్యకారులు గోదావరి ప్రాంతాలకు వెళ్లరాదని సూచించారు.

ఇంద్రవెల్లి, సెప్టెంబర్1: మండలంలోని ఆయా గ్రామాల్లోని అంతర్గత మట్టిరోడ్లు చిత్తడిగా మారాయి. రోడ్లపై నుంచి వరద నీరు పారడంతో రాకపోకలు చేసేందుకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. వాగులు పొంగిపోవడంతో గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందిపడ్డారు.

### ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగ నది

బేల, సెప్టెంబర్ 1 : మండల సరిహద్దులోని పెన్‌గంగా నది ఉధృతంగా ప్రవహిస్తుంది. శనివారం రాత్రి కురిసిన వర్షాలతోపాటు ఎగువనున్న మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు పెన్‌గంగా నదికి వరద ఉధృతి పెరిగింది. దీంతో మండలంలోని సాంగిడి, భేదోడ, మనియార్పూర్, గూడ, కంగర్పూర్ గ్రామాల ప్రజలు భయాందోళనలతో రాత్రి వేళల్లో నిద్ర పోకుండా అప్రమత్తంగా ఉన్నారు. పెన్‌గంగా నీటి ఉధృతి పెరగడంతో సాంగిడి గ్రామ సమీపంలో రోడ్డుపై నీరు నిల్వ ఉండడంతో ఆదివారం రాకపోకలు నిలిచిపోయాయి. బేల మండలంలోని సాంగిడి భేదోడ గూడ, కామ్ గర్పూర్, మానియార్‌పూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.

కుభీర్, సెప్టెంబర్ 1 : మండలంలోని వాగులు, వంకలు, చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయి. కుభీర్‌లోని ప్రభుత్వ దవాఖాన చుట్టు వరదనీరు చేరి అందులోకి వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. కస్ర రిజర్వాయర్, డోడర్న, సత్యం చెరువుల్లోకి వరదనీరు వచ్చి చేరుతుండడంతో అలుగులు ఎత్తి పోస్తున్నాయి.

### కాలనీలను పరిశీలించిన మున్సిపల్ అధికారులు

ఎదులాపురం, సెప్టెంబర్ 1: జిల్లా కేంద్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆదివారం మున్సిపల్ అధికారులు పట్టణంలోని పలు కాలనీలో పర్యటించారు. ఆరో వార్డులోని కుమ్మరి కుంట ప్రాంతంలో నీటి ప్రవాహాన్ని మున్సిపల్ కమిషనర్ ఎండి ఖమర్ అహ్మద్ పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంట సానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, అధికారులు ఉన్నారు.

### లో లెవల్ వంతెనలపై ప్రవహించిన వరద నీరు..

కుంటాల, సెప్టెంబర్, 1 : మండలంలో ఆయా గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి నుండి భారీ వర్షం కురిసింది. 3.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీటి ప్రవాహంతో ప్రయాణానికి ఆటంకం కలిగింది. ఓలా నుంచి సూర్యాపూర్ వెళ్లే దారిలోనున్న లోతట్టు వంతెన, వెంకూర్ నుండి పాత వెంకూర్ మధ్య గల వంతెనలపై వరద ప్రవాహం ప్రమాదకరంగా కనిపించింది. ఉధృతి ఎక్కువ ఉండడంతో ప్రజలు ఎవరూ రాకుండా అధికారులు సూచికలు ఏర్పాటు చేశారు. ఓలా నుంచి లింబా (బీ) వెళ్లే దారిలో గల లో లెవల్ వంతనపై ఆర్టీసీ బస్సు వెళ్లగా ప్రవాహం ప్రమాదకరంగా ఉండడంతో డ్రైవర్ కాసేపు నిలిపి ఉంచాడు.

### పొంగి ప్రవహిస్తున్న స్వర్ణ వాగు

సోన్, సెప్టెంబర్ 1: గత రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నందున స్వర్ణ ప్రాజెక్టు నిండటంతో అధికారులు గేట్లు ఎత్తడంతో స్వర్ణ వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. చిట్యాల్, జాఫ్రాపూర్, మాదాపూర్ బ్రిడ్జిని ఆనుకొని ప్రవహిస్తుండటంతో అధికారులు, పోలీసులు ఇప్పటికే ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

### నీట మునిగిన పంట పొలాలు..

తాంసి, సెప్టెంబర్ 1 : మండలంలో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. చెరువులు నిండుకుండలా మారగా లోతట్టు ప్రాంతంలోని పంట పొలాలు నీట మునిగాయి. పంట పొలాలకు వెళ్లే రైతులకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని పలు లోతట్టు కల్వర్టులను ఎంపీడీవో మోహన్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు.

### ఉప్పొంగిన పెన్‌గంగా

జైనథ్, సెప్టెంబర్ 1 : మండలంలోని గిమ్మ, జైనథ్ గ్రామాల్లోని చెరువులు, వరద నీటితో జల కళను సంతరించుకుంది. మండలంలోని కోరట, అకోలి, డొల్లర, ఆనంద్‌పూర్ గ్రామాల సరిహద్దులోని పెన్‌గంగా నది వరద నీటితో ఉప్పొంగి ప్రవహించింది. మండలంలోని బహదూర్ పూర్ వద్ద గల తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులోని బ్రిడ్జిపైనుంచి పెన్‌గంగా నది ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బేల మండలకేంద్రానికి వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్ జైనథ్ మండలంలోని లక్ష్మిపూర్ గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభం విరిపోవడంతో విద్యు త్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

### భారీ వర్షాలతో పంటకు నష్టం

తలమడుగు, సెప్టెంబర్ 1 : మండలంలోని ఉమ్రి గ్రామంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు గ్రామానికి చెందిన పెందూర్ దిగంబర్ అనే రైతు పత్తి పంటకు నష్టం వాటిల్లింది. గాలివాన బీభత్సానికి పత్తి పంట దెబ్బతింది. పూత దశలో ఉన్న పంట నేలకొరిగింది. సంబంధిత అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

### స్వర్ణ ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

సారంగాపూర్, ఆగస్టు 1 : మండలంలోని స్వర్ణ ప్రాజెక్టును ఆదివారం జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్, జిల్లా ఎస్పీ జానకీ షర్మిల సందర్శంచారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు గేట్లు, వరద ప్రవాహాన్ని స్వయంగా పర్శిలించారు. భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టు అధికారులు అందుబాటులో ఉం టూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గేట్లను ఎత్తివేయడం మూలంగా వాగు పరివాహక గ్రామాల ప్రజలు బయ టకు రాకుండా ఉండాలన్నారు. ఇందులో ప్రాజెక్టు ఈఈ లక్ష్మి, డీఎస్పీ గంగారెడ్డి, డీఈఈ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మికాంత్‌రావు, ఎస్ఐ శ్రీకాంత్, ఇన్‌చార్జీ ఎంపీవో తిరుపతిరెడ్డి, జేఈ దేవేందర్‌ఉన్నారు.

### వాగులు దాటి రావొద్దు

పెంబి, సెప్టెంబర్ 1: నిన్న, నేడు భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన పెంబి మండల కేంద్రంలో పర్యటించారు. తహసీల్దార్ కార్యలయంలో రికార్డులను పరిశీలించారు. అత్యవసరంలో తప్ప ఏవరూ భయటకు వెళ్లవద్దని సూచించారు.

### కడెం ప్రాజెక్టు 10 గేట్ల ద్వారా నీటి విడుదల

కడెం, సెప్టెంబర్ 1: బంగాళఖాతంలో ఎర్పడిన అల్పపీడనం వల్ల జిల్లాలో అధికంగా కురుస్తున్న వర్షాల వల్ల కడెం ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు (7.603టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 695 అడుగులు (6.361టీఎంసీల) వద్ద ఉంది. కాగా, ఎగువ ప్రాంతాల నుండి ప్రాజెక్టులోకి 65130 క్యూసెక్కుల వరదనీరు రావడంతో అధికారులు 10 వరదగేట్లను ఎత్తి ప్రాజెక్టులోకి 79850 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కుడి కాలువకు 8 క్యూసెక్కులు, ప్రధాన కాలువకు 580 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: పోలీసులు

జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖానాపూర్ సీఐ సైదారావు, కడెం ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి ప్రజలకు సూచించారు.

### సాత్నాల ప్రాజెక్టు గేట్లను ఎత్తివేసిన అధికారులు

జైనథ్, సెప్టెంబర్ 1 : మండలంలో ఆదివారం ఉదయం వర కు భారీ వర్షం కురిసింది. సాత్నాలలో ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో ప్రాజెక్టు నాలుగు గేట్లలో ఆదివారం వేకువజామున మూడు గేట్లను నీటి పారుదల శాఖాధికారులు తెరిచి వరద నీటిని దిగువ ప్రాంతానికి వదిలివేశారు. సాత్నాల ప్రాజెక్టు గరిష్టి సామర్థ్యం 286.50 అడుగులు కాగా 285.80 అడుగులకు వరద నీరు రావడంతో మూడు గేట్లను తెరిచి వరద నీటిని వదిలారు. సాత్నాల ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్, ఏఈ మారుతి పరిశీలిస్తున్నారు.

### మత్తడివాగు ప్రాజెక్టు 3 గేట్లు ఎత్తివేత..

తాంసి, సెప్టెంబర్ 1 : మహారాష్ట్ర ఎగువ ప్రాంతంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వడ్డాడి మత్తడి వాగు ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 277.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 277.20 మీటర్లుగా ఉంది. ఇన్ ఫ్లో 16640 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 17100 క్యూ సెక్కులుగా ఉంది. ప్రాజెక్ట్ మూడు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. రైతులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఏఈ హరీశ్ కుమార్ తెలిపారు.

### గడ్డెన్నవాగు ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత

భైంసా, సెప్టెంబర్, 1: భైంసా పట్టణంలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో నీరు పెరుగుతూ వచ్చింది. దీంతో అధికారులు ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తివేశారు. ప్రాజెక్టులోకి ఇన్‌ప్లో కింద 15 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో ఔట్ ప్లో కింద 20 క్యూసెక్కుల నీటిని అధికారులు బయటకు విడుదల చేశారు.

### స్వర్ణ ప్రాజెక్టు 4గేట్లు ఎత్తివేత

సారంగాపూర్, ఆగస్టు 1: స్వర్ణ ప్రాజెక్టుకు వరద తాకిడి ఎక్కువైంది. దీంతో ఆదివారం ప్రాజెక్టులో నీరు ఎక్కువ కావడంతో అధికారులు 1,2,3,4 గేట్లను ఎత్తివేసి నీటిని వరద కాలువలోకి వదిలిపెట్టారు. అయితే ప్రాజెక్టు నీటి మట్టం 1183 అడుగులకు 1183 అడుగుల నీరు చేరింది. ప్రాజెక్టు కెపాసిటి 1.484 టీఎంసీలు కాగా 1.484 టీఎంసీలు చేరింది. ప్రాజెక్టులోకి ఎన్‌ఫోగా 26000 క్యూసెక్కులు వచ్చి చేరడంతో అవుట్ ఫ్లోగా 30,080 క్యూసెక్కుల నీటిని వరద కాలువలోకి వదిలిపెట్టారు. అలాగే లెప్టు కెనాల్ ద్వారా 20, ఆర్‌ఎఫ్ కెనాల్ ద్వారా 20, జౌళినాల ద్వారా 40 క్యూసెక్కుల నీటిని వదిలారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :ఎమ్మెల్యే

భైంసా, సెప్టెంబర్, 1 : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్షం పడుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంట్లోనే ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలన్నారు. అత్యవసర స మయంలో ఫోన్ ద్వారా అధికారులను సంప్రదించాలన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఖానాపూర్, సెప్టెంబరు 1: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ నేత భుక్యా జాన్సన్‌నాయక్ సూచించారు. ఆదివారం 'నమస్తే తెలంగాణ'తో ఫోన్‌లో మాట్లాడారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు గోదావరి, చెరువులు, కుంటలు, విద్యుత్ తీగలు, ఐరన్ స్తంబాల దగ్గరకు వెళ్లకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. జిల్లాకు రెడ్ అలెర్ట్‌గా ప్రకటించిన నేపథ్యంలో వాగులు, గోదావరి ప్రాంతాలను సందర్శించడానికి వెళ్లి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని అన్నారు. అత్యవసర సమయంలో బీఆర్ఎస్ నాయకులు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 1: భారీ వర్షాల కారణంగా సోమవారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదివరకే అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించనట్లు తెలిపారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

నార్నూర్, సెప్టెంబర్ 1 : బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ అన్నారు. మండలంలోని మాన్కాపూర్ గ్రామంలో బీజేపీ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గిరిజన మహిళ మోర్చా మండలాధ్యక్షులుగా జాదవ్ విద్యారాణి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తొడసం బండు, ప్రకాశ్, జ్ఞానోబాపుష్కర్, రాథోడ్ బాబులాల్, విశాల్ తదితరులున్నారు.

## శంకర్‌రావ్ జయంతి

బోథ్, సెప్టెంబర్ 1 : బోథ్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం చట్ల శంకర్ రావ్ జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బోథ్ నియోజకవర్గ కార్యదర్శి గోవర్ధన్ మాట్లాడుతూ కార్మికులకు, కర్షకులకు అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు సిరిపురం దాస్, భోజన్న, పట్టణ శాఖధ్యక్షులు ఎల్.నరేష్ పాల్గొన్నారు.

## ఎస్ఐకి సన్మానం

బోథ్, సెప్టెంబర్ 1 : బోథ్ ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌ను ఆదివారం సీపీఐ నాయకులు సన్మానించారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బి గోవర్ధన్, సిరిపురం దాస్, భోజన్న, భోజారెడ్డి, ఎల్ నరేశ్, నాయకులు కార్తీక్, మున్సిఫ్, శ్రీనివాస్, సుమేర్ పాషా, పాల్గొన్నారు.

## టోల్ ఫ్రీ నంబర్లను సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్, సెప్టెంబర్ 1: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల కోసం ఏర్పాటు చేసిన 9666693594, 9948045865 టోల్ ఫ్రీ నంబర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం కోరారు. రోడ్డు, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ఈ నంబర్లకు కాల్ చేయవచ్చున్నారు.

## జాగ్రత్తలు పాటించాలి

ఖానాపూర్, సెప్టెంబర్ 1: పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ వాడకం పట్ల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదివారం విద్యుత్ శాఖ ఏఈ రాంసింగ్ కోరారు. అత్యవసర సమాయల్లో విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించాలని అన్నారు.

## బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

సారంగాపూర్, సెప్టెంబర్ 1: దేశం మొత్తం బీజేపీతోనే సాధ్యం అవుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి మేడిసెమ్మే రాజు అన్నారు. ఆదివారం మండలంలోని చించోలి(బి) ఆదిత్య గార్డెన్‌లో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోది దేశంలో ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. నరేంద్రమోది పరిపాలను చూసి ప్రపంచ దేశాలు గర్వపడుతున్నాయన్నారు. ఇందులో బీజేపీ మండల అధ్యక్షుడు కరిపె విలాస్, బీజేపీ నాయకులు రాంరెడ్డి, చాణక్య, రాంశంకర్‌రెడ్డి, వడెరాజేందర్‌రెడ్డి, గంగారెడ్డి, సాహెబ్‌రావు, ఎల్లన్న, రాజేశ్వర్‌రెడ్డి, కరుణాసాగర్‌రెడ్డి, రాజారెడ్డి, భూమారెడ్డి, తిరుమలచారి ఉన్నారు.

## హిందూ ఐక్యతను చాటాలి

భైంసా, సెప్టెంబర్ 1 : ప్రతిరోజు సత్సంగ్‌లో పాల్గొని హిందూ ఐక్యతను చాటాలని విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ అన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ మహిషా శాఖ ఆధ్వర్యంలో 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహించారు. మహిషా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డా మహిపాల్, ఉపాధ్యక్షుడిగా రాజేందర్, రంగు శ్రీనివాస్, కార్యదర్శిగా శివకుమార్, కోశాధికారిగా కళ్యాణ్, భజరంగ్ సంయోజక్‌గా ప్రవీణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## వేణుగోపాలకృష్ణకు పురస్కారం

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్,1: నిర్మల్ జిల్లా ఖానాపూర్ ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారి డా. వేణుగోపాలకృష్ణకు పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగిన 24 ఫ్రేమ్స్ మీడియా కార్యక్రమంలో డా. వేణుగోపాలకృష్ణకు సీనియర్ నటుడు మాజీ ఎంపీ మురళీమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వేణుగోపాలకృష్ణ స్వీయ దర్శకత్వంలో నటించిన ప్రేమతో నాన్న ఉత్తమ చిత్రంగా ఎంపికై ఇదివరకే నాలుగు నంది పురస్కారాలు పొందారు. ఈ కార్యక్రమంలో జ్యూరీ సభ్యులు నర్సింహారావు, నిర్మాతలు నాగేశ్వర్ రెడ్డి, టీఎఫ్‌సీసీ సభ్యులు పద్మిని, సురేఖ, గోల్డ్‌బాబు, రమేష్ తదితరులు ఉన్నారు.


## కరాటేలో పతకాలు

సోన్, సెప్టెంబర్ 1: సోన్ మండల కేంద్రంలోని అభ్యాస గురుకులం విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లోని కండ్లకోయలో నిర్వహించిన ఓపెన్ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్–2024లో విద్యార్థులు పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. పాఠశాలకు చెందిన గుమ్ముల శైలజ గోల్డ్ మెడల్, ఆరెపల్లి వర్షిని, ఇందూరి సంజయ్‌లు సిల్వర్ మెడల్స్ సాధించడంతో ఉపాధ్యాయులు అభినందించారు.

## వైద్య శిబిరం

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 1: నిర్మల్ పట్టణంలోని జీఎన్‌ఆర్ కాలనీలోని అల్ఫోర్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వరద ముంపు బాధితుల కేంద్రంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి శ్రీనివాస్, వైద్యులు శ్వేత, విఘ్నేష్, సీవో రమణ, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, సెప్టెంబర్ 1 : మండలకేంద్రానికి చెందిన గురిజల సాయికిరణ్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న ఆదివారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ లింగారెడ్డి, తాజామాజీ సర్పంచ్ డి.దేవన్న, మాజీ ఎంపీటీసీ లస్మన్న, ఆలయ మాజీ చైర్మన్ పి.వెంకట్ రెడ్డి, ఏజేకే డైరెక్టర్ అడెల్లు ఉన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్,సెప్టెంబర్1: మండల కేంద్రంలోని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లీష్1, తెలుగు 2, హిందీ 1, హిస్టరీ 1, ఏకనామిక్స్ 2, పొలిటికల్‌సైన్స్1, కామర్స్ 2, గణితం 2, భౌతికశాస్త్రం3, జువాలజీ 1, సబ్జెక్టులలో ఖాళీలు ఉన్నాయని, పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు అర్హులు న్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, బోధన అనుభవం ఉన్న సంబంధిత నిజధ్రువపత్రాలు సమర్పిస్తే వేయిటేజీ ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 4వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని, 6వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్‌లో ఇంటర్వ్యులు నిర్వహించబడుతాయని తెలిపారు.

## సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత


బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

బజార్‌హత్నూర్, సెప్టెంబర్1: మండల కేంద్రానికి చెందిన గుండు రుక్మకు రూ.22.500లు,దేగామ గ్రామానికి చెందిన గాజుల సాయితేజకు రూ.24వేలు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భాదితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజే శారు. ఈకార్యాక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిక్కాల జనార్ధన్,భాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి

బోథ్, సెప్టెంబర్ 1 : గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని బోథ్ సీఐ రమేష్ సూచించారు. ఆదివారం సాయంత్రం షాదీఖానలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిబంధనలకు లోబడి ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. నవరాత్రుల సందర్భంగా పోలీసులకు సహకారం అందించాలన్నారు. సమావేశంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పొలాల అమావాస్య

సోన్, సెప్టెంబర్ 1: సోన్ మండలంలోని పాక్‌పట్ల, మాదాపూర్ గ్రామాల్లో ఆదివారం పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. రైతులు బసవన్నలను అలంకరించి హనుమాన్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం తీపి వంటకాలను నైవేద్యంగా సమర్పించారు.

## నిబంధనల ప్రకారం రేషన్ అందించాలి

తాంసి, సెప్టెంబర్ 1 : మండలంలోని కప్పర్లతోపాటు పలు గ్రామాల్లో రేషన్ దుకాణాలను ఆదివారం ఎన్ఫోర్సెమెంట్ డీటీ పుష్పమాల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు పలు సూచనలు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు.


### ఉద్యోగాలు సాధించడం సంతోషకరం

కుంటాల, సెప్టెంబర్, 1: మండల కేంద్రానికి చెందిన దేవేందర్, సాగర్, శ్రీకాంత్ అనే యువకులు గురుకుల పీఈటీ ఉద్యోగాలు, పంచాయతీ కార్యదర్శి రాజబాబు ప్రభుత్వ ప్రశంసా పత్రంతో పొందడంతో నాయకుడు జీవీ రమణ రావు, విశ్రాంత ఉద్యోగులు సన్మానం చేశారు. కుంటాలకు చెందిన యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం సంతోషకరమని వక్తలు ఉన్నారు. రమేశ్ గౌడ్ ఎన్, గజ్జారాం ఉన్నారు.

### చోరీ కేసులో దొంగ అరెస్ట్

ఎదులాపురం, సెప్టెంబర్ 1 : ఈనెల 25వ తేదీన మహలక్ష్మివాడ అందె సురేశ్‌కు చెందిన కిరాణషాప్‌లో చోరీ చేసిన షేక్ ఆయన్ ఆదివారం అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ ఎస్ఐ విష్ణు ప్రకాష్ తెలిపారు. గణేష్ మందిర్ వద్ద పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అనుమానంగా పోలీస్‌లను చూసి పారిపోతున్న షేక్ ఆయన్ అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

## ఆర్టీసీ రాయితీ పథకాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

తలమడుగు, సెప్టెంబర్ 1 : మండలంలోని భరంపూర్ గ్రామంలో ఆదివారం ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ అందిస్తున్న రాయితీ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఆర్టీసీ ద్వారా అందిస్తున్న రాయితీ బస్సు పాసులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివాహాలకు, విహార యాత్రలకు బస్సులపై రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీబీవోలు శ్రీనివాస్, మధు, వీఆర్ఏ రాకేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ అమలు చేయాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 1 : ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన పాత పెన్షన్ అమలు హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీత్ చౌహాన్, వలభోజు గోపికృష్ణ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1 కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) అమలుకు వ్యతిరేక దినం సందర్భంగా ఆదివారం సమావేశంలో మాట్లాడుతూ కేంద ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం కేంద్ర ఉద్యోగులకు సంబంధించిందని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనిన అన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా సీపీఎస్ రద్దు విషయంలో నిర్ణయం తీసుకోకపోవడం అన్యాయమన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.